

'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'

4

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

JV NEWS


ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103

సంపుటి - 3 సంచిక -5 బుధవారం 27 మే 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts

# పంచాయతీ సిబ్బందికి తీపి కబురు




## 50 వేల మంది సిబ్బందికి ఒకటో తారీఖునే జీతాలు



జీతాల కోసం ప్రతినెలా రూ. 50 కోట్ల ప్రత్యేక నిధుల విడుదల

గ్రామ పంచాయతీలకు ఆర్థిక స్వేచ్ఛ కల్పిస్తూ కీలక నిర్ణయం

పోస్టల్ విధానం రద్దు.. ఇకపై పెన్షన్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి జమ

**హైదరాబాద్ మే 26 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ సిబ్బందికి తెలంగాణ ప్రభుత్వం తీపికబురు అందించింది. సుమారు 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెలా ఒకటో తారీఖునే జీతాలు చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఐఏఎస్ అధికారులకు సమయానికి జీతాలు అందినట్లే, క్షేత్రస్థాయిలో పనిచేసే పంచాయతీ సిబ్బందికీ వేతనాలు అందాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించి, పలు కీలక సూచనలు చేశారు.గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాల చెల్లింపులో జాప్యం జరగకుండా,**మిగతా 2లో...**

# శుద్ధి యురేనియం అప్పగించాల్సిందే

## ఇరాన్‌తో చర్చలపై తాజాగా ట్రంప్ వెల్లడి



**వాషింగ్టన్,మే 26 (జర్నలిస్ట్ వార్త):** అమెరికా-ఇరాన్ మధ్య జరుగుతున్న శాంతి చర్చల్లో అణు కార్యక్రమం కీలకాంశంగా మారింది. శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవాలని అమెరికా కోరుతుండగా, అందుకు ఇరాన్ పూర్తిగా అంగీకరించడం లేదు. తాజాగా ఇరాన్ అణు కార్యక్రమంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ వద్ద ఉన్న అధికంగా శుద్ధి చేసిన యురేనియంను అమెరికాకు అప్పగించాలని, లేదంటే అంతర్జాతీయ పర్యవేక్షణలో పూర్తిగా ధ్వంసం చేయాలని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యక్రమం ప్రపంచ దేశాలకు ముప్పుగా మారే అవకాశముందని ట్రంప్ హెచ్చరించారు. అధిక శుద్ధి చేసిన యురేనియం ద్వారా **మిగతా 2లో...**

# శివరాజ్ సింగ్ చౌహాన్ మోదీపై పుస్తకం..

ప్రధాని మోదీతో తన అనుభవాలపై 'అప్నాపన్' పేరుతో రచన

ఢిల్లీలో జరిగిన ఈ వేడుకకు హాజరైన ఏపీ మంత్రి నారా లోకేష్

మాజీ ప్రధాని దేవెగౌడ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ఆవిష్కరణ

కార్యక్రమంలో పలువురు జాతీయ నేతలను కలిసిన లోకేశ్



2లో.

# మజ్లిస్ ఒత్తిడితోనే జిహెచ్ఎంసి విభజన

నగరంలో మంచినీటి సమస్యను పట్టించుకోని ప్రభుత్వం

తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపణ



# పోలీస్ కస్టడీకి బండి భగీరథ్

అనుమతిచ్చిన కోర్టు

నేడు చర్లపల్లి జైలునుంచి సిట్ కార్యాలయానికి తరలింపు విచారించనున్న బృందం



2లో.




# నేటినుంచి టిడిపి మహానాడు

వర్చువల్ విధానంలో రెండ్రోజుల పండగ

పార్టీ నేతలతో చర్చించిన అధినేత చంద్రబాబు

**అమరావతిమే 26 (జర్నలిస్ట్ వార్త):** టీడీపీ మహానాడు 2026 రెండ్రోజుల పాటు జరుగనుంది. బుధ,గురువారాల్లో

ఈసారి పూర్తిగా వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్నారు. దీనిని వివిధ మాధ్యమాల ద్వారా ప్రసారం చేస్తారు. ఈ విషయాన్ని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు, గ్రామ స్థాయి కార్యకర్తలతో**మిగతా 2లో...**

# తెలంగాణలో అవినీతి రాజ్యం

అడ్డంగా దోచుకుంటున్న కాంగ్రెస్

శంషాబాద్‌లో 180 ఎకరాలు హాంఫట్

సింగరేణిలో కోట్ల రూపాయాల బొగ్గు మాయం

కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్ రావు సంచలన ఆరోపణలు




# గవర్నర్ ను కలిసిన కవిత... రేవంత్ సర్కారుపై ఫిర్యాదు

ఖమ్మం, పరిగి, ఆర్ఆర్ఆర్ బాధితుల సమస్యలను వివరించిన కవిత

రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు

బాధితులకు న్యాయం జరగకపోతే మళ్లీ ఉద్యమిస్తామని హెచ్చరిక



**హైదరాబాద్ మే 26 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్ర ప్రభుత్వ భూసేకరణ కారణంగా నిరాశ్రయులైన బాధితులకు న్యాయం చేయాలని తెలంగాణ రక్షణ సమితి (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కె. కవిత గవర్నర్‌ను కోరారు. మంగళవారం ఆమె ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్, పలువురు బాధితులతో కలిసి గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్‌భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఒక వినతిపత్రం సమర్పించారు.**మిగతా 2లో...**

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక



# పంచాయతీ సిబ్బందికి రేవంత్ సర్కారు తీపి కబురు

మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం నుంచి ప్రతినెలా రూ.50 కోట్లను ప్రత్యేకంగా విడుదల చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. కేవలం పంచాయతీ సిబ్బందికే కాకుండా, ప్రభుత్వంలోని అన్ని శాఖల పరిధిలోని అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ నెల మొదటి రోజే జీతాలు అందేలా చూడాలని తేల్చిచెప్పారు. సిబ్బంది జీతాల చెల్లింపులో ఒక్కరోజు ఆలస్యమైనా సహించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీ ఖాతాలో జమ చేయాలన్న నిబంధనను రద్దు చేయాలని ఆదేశించారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 70(3)కి సవరణలు చేసి, పంచాయతీల సొంత ఆదాయాన్ని ప్రభుత్వ ట్రెజరీకి బదులుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇది పంచాయతీల ఆర్థిక స్వేచ్ఛను పునరుద్ధరించడానికి దోహదపడుతుందని సీఎం అభిప్రాయపడ్డారు.

పెన్షన్ల పంపిణీ విధానంలోనూ మార్పులు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న పెన్షన్లను ఇకపై నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని చెప్పారు. ఈ విధానం ద్వారా పారదర్శకత పెరుగుతుందని, అనర్హులను ఏరివేయడం సులభమవుతుందని తెలిపారు. ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్, సామాజిక-ఆర్థిక కుల గణన (ఎస్ఈసీసీ) డేటాను ఉపయోగించి పెన్షన్ల క్రమబద్ధీకరణ చేపట్టాలన్నారు. అర్హులైన వారికి కొత్త పెన్షన్లు మంజూరు చేయడానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నేటినుంచి టిడిపి మహానాడు

మొదటిపేజీ తరువాయి

సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మహానాడు నిర్వహణ, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై కీలక దిశానిర్దేశర చేశారు. తెలుగువారు ఆసక్తిగా ఎదురు చూసే కార్యక్రమం మహానాడు అని, పార్టీకి అది ఒక భావోద్వేగమని సీఎం చంద్రబాబు అన్నారు. మహానాడు ద్వారా పార్టీ ప్రజలకు ఏ సందేశం ఇస్తుందో
అన్న ఆసక్తి అందరిలో ఉంటుందని చెప్పారు. గతంలో కోవిడ్ సమయంలో కూడా డిజిటల్ పద్ధతిలో మహానాడు నిర్వహించామని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మరోసారి వర్చువల్ విధానాన్నే ఎంచుకున్నామని చెప్పారు. ఇంత పెద్ద ఎత్తున వర్చువల్ రూపంలో మహానాడు నిర్వహించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా 1845 క్లస్టర్ల పరిధిలో మహానాడు నిర్వహిస్తున్నామని తెలిపారు. పార్టీ ఎదుగుదలకు, కార్యకర్తలు నాయకులుగా ఎదగడానికి క్లస్టర్ విధానం ఉపయోగపడుతుందని వివరించారు. ఈసారి 'స్త్రీశక్తి' థీమ్‌తో మహానాడు నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. క్లస్టర్ల వారీగా క్షేత్రస్థాయిలో జరిగే మహానాడులో రాష్ట్రస్థాయి నాయకులు కూడా పాల్గొంటారని సీఎం చంద్రబాబు తెలిపారు. మహానాడులో సరైన మార్గనిర్దేశర చేసుకుని వాటిని అమలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని తిరుగులేని శక్తిగా నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులు, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న ప్రతి ఒక్కరిలో జవాబుదారీతనం ఉండాలని.. అప్పుడే ప్రజలు విశ్వసిస్తారని అన్నారు. పార్టీ కార్యకర్తలు అన్ని విధాలా సాధికారత సాధించేలా కృషి చేయాలని సూచించారు. ఎన్టీఆర్‌కు ఘన నివాళులు అర్పించడంతో పాటు రాష్టాభివృద్ధికి పునరంకితమయ్యేలా మహానాడును నిర్వహించుకుందామని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.



# గవర్నర్ ను కలిసిన కవిత... రేవంత్ సర్కారుపై ఫిర్యాదు

మొదటిపేజీ తరువాయి

ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఇళ్లు కూల్చివేతకు గురైన బాధితులందరికీ ఇంటి స్థలాలు కేటాయించాలని, పరిగి మండలం కడ్లాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్క్ కోసం జారీ చేసిన భూసేకరణ నోటీసును రద్దు చేయాలని వారు గవర్నర్‌ను కోరారు. అలాగే, రీజినల్ రింగ్ రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్) అలైన్‌మెంట్ మార్పు, ఇతర భూసేకరణ సమస్యలను కూడా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

గవర్నర్‌తో భేటీ అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మహిళల ఇళ్లను కూల్చివేస్తున్నారని, రేవంత్ రెడ్డి ఒక నిర్దయుడైన ముఖ్యమంత్రి అని, కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గమైన పాలన అందిస్తోందని ఆమె విమర్శించారు. వంద రూపాయల చీరలు పంచి బాధితులను లక్షాధికారులను చేశానని సీఎం అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు.

తమ పోరాటాల ఫలితంగా వెలుగుమట్ల బాధితులకు అదే స్థలంలో భూమి కేటాయించడానికి ప్రభుత్వం అంగీకరించిందని, పరిగి, ఆర్‌ఆర్‌ఆర్ భూసేకరణ ప్రక్రియలను నిలిపివేసిందని కవిత తెలిపారు. ఇవి పాక్షిక విజయాలని, సంపూర్ణ న్యాయం కోసం కేంద్రం ప్రమేయం అవసరమని, అందుకే గవర్నర్‌ను కలిశామన్నారు. గవర్నర్ సానుకూలంగా స్పందించారని, అన్ని అంశాలపై నివేదిక తెప్పించుకుని న్యాయం చేస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. బాధితులకు న్యాయం జరగని పక్షంలో మరోసారి ఉద్యమబాట పడతామని ఆమె హెచ్చరించారు.

# శివరాజ్ సింగ్ చౌహాన్ మోదీపై పుస్తకం..

## ప్రధాని మోదీతో తన అనుభవాలపై 'అప్నాపన్' పేరుతో రచన






**ఢిల్లీ మే 26 (జర్నలిస్ట్ వార్త):** కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రచించిన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీతో తనకున్న వ్యక్తిగత అనుబంధం, అనుభవాల గురించి వివరిస్తూ చౌహాన్ 'అప్నాపన్: మై ఎక్స్‌పీరియన్సెస్ విత్ నరేంద్ర మోదీ' పేరుతో ఈ పుస్తకాన్ని రాశారు. ఢిల్లీలోని పూసాలో ఉన్న ఐకార్ క్యాంపస్‌లో మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది.ఈ పుస్తకాన్ని మాజీ ప్రధాని హెచ్.డి. దేవెగౌడ, మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. ఈ వేడుకలో ఏపీ మంత్రి నారా లోకేష్ పాల్గొని పలువురు జాతీయ స్థాయి నేతలను కలిశారు. ఈ కార్యక్రమానికి ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు, బీజేపీ సీనియర్ నేతలు, సాహితీవేత్తలు హాజరయ్యారు. ప్రధాని మోదీ నాయకత్వ లక్షణాలు, ఆయన వ్యక్తిత్వం, ప్రజలతో మమేకమయ్యే తీరును ఈ పుస్తకం చక్కగా వివరిస్తుందని వక్తలు ప్రశంసించారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షమైన టీడీపీ తరపున లోకేష్ ఈ కార్యక్రమంలో పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# మజ్లిస్ ఒత్తిడితోనే జిహెచ్‌ఎంసి విభజన

## నగరంలో మంచినీటి సమస్యను పట్టించుకోని ప్రభుత్వం

## తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపణ



**హైదరాబాద్,మే 26 (జర్నలిస్ట్ వార్త):** కేసీఆర్ హయాంలో కూడా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేశారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ రెండు పార్టీలు కూడా హైదరాబాద్‌లోని పేద ప్రజలకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. మజ్లిస్ ఒత్తిడితో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు ముక్కలు చేశారని రామచందర్‌రావు దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో డివిజన్ల ఏర్పాటుపై ఇప్పటికీ అధికారులకు ఒక క్లారిటీ లేదని చెప్పారు.ఇందిరమ్మ ఇళ్లపేరుతో ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తోందని మతీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తోందని ధ్వజమెత్తారు. మంగళవారం కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో ప్రజలు నీటి సమస్యను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలకు నీటి సరఫరా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని మండిపడ్డారు. ప్రజాసమస్యలను కాంగ్రెస్ నేతలు పక్కదారి పట్టిస్తున్నారని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్‌కు మజ్లిస్ ముఖ్యం కానీ, హైదరాబాద్ ప్రజలు ముఖ్యం కాదని చెప్పుకొచ్చారు. భాగ్యనగరంలో కాలుష్య నియంత్రణలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో రియల్ ఎస్టేట్ పేరుతో జేబులు నింపుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయ్యిందని అన్నారు. భాగ్యనగరంలో చిన్న వాన పడితే.. నగరం మునిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భాగ్యనగరాన్ని విశ్వనగరంగా బీజేపీ మాత్రమే మార్చగలదని వ్యాఖ్యానించారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో మజ్లిస్, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని హెచ్చరించారు. తెలంగాణలో అవినీతి రహితమైన పరిపాలనను బీజేపీ మాత్రమే అందిస్తుందని రామచందర్‌రావు పేర్కొన్నారు.

# శుద్ధి యురేనియం అప్పగించాల్సిందే

మొదటిపేజీ తరువాయి

అణ్వాయుధాల తయారీ సాధ్యమవుతుందని, అందుకే దీనిపై కఠిన చర్యలు అవసరమని పేర్కొన్నారు. అమెరికా జాతీయ భద్రతను కాపాడేందుకు అవసరమైతే మరింత కఠిన నిర్ణయాలు తీసుకుంటామని కూడా చెప్పారు . కాగా, తమ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ అంగీకరించినట్టు వార్తలు వస్తున్నాయి. తాము అణ్వాయుధం కోసం వెంపర్లాడడం లేదని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఇరాన్ శుద్ధి చేసిన ఆ యురేనియాన్ని అమెరికాకు అప్పగించాలని లేకపోతే నాశనం చేయాలని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ట్రూత్‌లో పోస్ట్ పెట్టారు. శుద్ధి చేసిన యురేనియంను నిర్వీర్యం చేసేందుకు అమెరికాకు అప్పగించాలి. లేకపోతే అటామిక్ ఎనర్జీ కమిషన్ లేక దాని సమానస్థాయి సంస్థ ఇరాన్‌తో సమన్వయం చేసుకొని.. ఒక ఆమోదయోగ్యమైన ప్రదేశంలో దానిని నాశనం చేయాలని ట్రంప్ రాసుకొచ్చారు. తన వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వదులుకోవడానికి ఇరాన్ సూత్రప్రాయంగా అంగీకరించిందని ఇప్పటికే వార్తలు
వచ్చిన సంగతి తెలిసిందే. ఇదిలాఉంటే.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. 70కి పైగా హెజ్‌బొల్లా స్థావరాలను టా÷-గ్గ్ం÷ట్ చేసింది. 10 కమాండ్ సెంటర్లు సహా ఆయుధ డిపోలను ధ్వంసం చేసినట్లు ఆ దేశ సైన్యం వెల్లడించింది.

# తెలంగాణలో అవినీతి రాజ్యం



**హైదరాబాద్,మే 26 (జర్నలిస్ట్ వార్త):)** తెలంగాణలో అవినీతి రాజ్యం నడుస్తోందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. భూములు ఆక్రమణలు, రెవెన్యూలో వేలకోట్ల స్కామ్‌లు, సింగరేణిలో బొగ్గు స్మకమా÷-÷-లు జరుగుతున్నాయని అన్నారు. అడ్డంగా దోచుకుంటున్నారని కాంగ్రెస్‌పై ఆయన విరుచుకు పడ్డారు. శంషాబాద్ సమీపంలోని 180 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. ఈ స్కాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహితుడి పాత్ర ఉందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై సిట్, సీఐడీ విచారణ జరపాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో హరీష్ రావు మాట్లాడుతూ.. ప్రైవేట్ వ్యక్తికి సదరు భూమి అప్ప జెప్పి.. తప్పు చేసిన ఎమ్మార్వోను బదిలీతో సరిపెట్టారన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి తహసీల్దారును వెంటనే డిస్మిస్ చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ స్కాం వెనుక సీసీఎల్‌ఏ ఉన్నాడా? కలెక్టర్ ఉన్నాడా? అంటూ హరీష్ రావు సందేహం వ్యక్తం చేశారు. ఈ భూమి ప్రభుత్వానిదని ఆర్డీవో చెబుతున్నారని చెప్పారు. పై అధికారి చెప్పినా వినకుండా.. ఎమ్మార్వో మాత్రం ఇది ప్రైవేట్ భూమి అంటున్నారని హరీష్ రావు వివరించారు. ముఖ్యమంత్రికి సన్నిహితుల నుంచి ఒత్తిడి ఉన్నందునే తహసీల్దారును బదిలీ చేసి కాపాడుతున్నారని ఆరోపించారు. సీఎం సన్నిహితుల ఒత్తిడితోనే.. ఎమ్మార్వోపై చర్యలు తీసుకోకుండా ఏసీబీ అధికారులు వెనక్కి వచ్చారని ఆరోపించారు. సింగరేణిలో రూ.16 వందల కోట్ల విలువైన బొగ్గు మాయమైందని ఆందోళన వ్యక్తం చేశారు. టన్నుల బొగ్గు ఎక్కడో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించాలని డిమాండ్ చేశారు. బొగ్గు ఉందో? లేదో? పరిశీలన కోసం అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు స్పష్టం చేశారు. 'కాంగ్రెస్ హఠావో - సింగరేణి బచావో'.. బొగ్గు గని కార్మికుల నినాదం కావాలని హరీష్‌రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హయాంలో సింగరేణి స్కాంలకు గనిలా మారిందని అభివర్ణించారు. నైనీ బ్లాక్ బొగ్గు గనుల టెండర్.. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని బయట పెట్టిందన్నారు. త్వరలో సింగరేణిపై కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమాలు మరిన్ని బయటపెడతానని హరీష్‌రావు స్పష్టం చేశారు. అలాగే రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై వేసిన సస్పెన్షన్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ శాఖలో వేల కోట్ల రూపాయిల అవినీతి జరుగుతోందంటూ ఈ సందర్భంగా హరీష్ రావు తీవ్ర ఆరోపణలు గుప్పించారు.

# ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

## కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు



**కరీంనగర్,మే 26 (జర్నలిస్ట్ వార్త):)** రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల విషయంలో పూర్తిగా విఫలం అయ్యిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర విమర్శలు చేశారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన నిధులు కేంద్ర ప్రభుత్వానివా, రాష్ట్ర ప్రభుత్వానివా అన్న విషయంపై సమాధానం చెప్పాలన్నారు. ధాన్యం రవాణా ఖర్చులను కూడా పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరిస్తోందని బండి సంజయ్ పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం కేవలం మధ్యవర్తిగా మాత్రమే వ్యవహరిస్తోందన్నారు. అయినప్పటికీ ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ఇకనైనా బేషజాలకు పోకుండా యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలని కోరారు. అలాగే అన్ని రకాల వడ్లకు బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడమే లక్ష్యంగా 'రైతు గోస - బీజేపీ భరోసా' పేరుతో యాత్రలు నిర్వహిస్తున్నామని బండి సంజయ్ తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి బీజేపీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

# పోలీస్ కస్టడీకి బండి భగీరథ్

**మేడ్చల్ మే 26 (జర్నలిస్ట్ వార్త):** మైనర్ బాలికపై లైంగికదాడికి సంబంధించి పోక్సో కేసు ఎదుర్కొంటున్న కేంద్రమంత్రి బండి సజంయ్ కుమారుడు బండి భగీరథ్‌ను మూడు రోజులపాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ మేడ్చల్ జిల్లా కోర్టు మంగళవారం నిర్ణయం తీసుకుంది. భగీరథ్‌ను తదుపరి విచారణ నిమిత్తం ఆరురోజులపాటు తమకు అప్పగించాలంటూ నాలుగు రోజుల క్రితం సిట్ అధికారులు కోర్టులో ఫిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. సిట్ పిటిషన్‌పై విచారించిన కోర్టు బుధవారం నుంచి పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. బుధవారం ఉదయం ఆయన్ను చర్లపల్లి జైలు నుంచి సిట్ కార్యాలయానికి తరలించనున్నారు. కూకట్‌పల్లిలోని సిట్ కార్యాలయంలో రీతూరాజ్ నేతృత్వంలో దర్యాప్తు బృందం విచారించనుంది. ఇప్పటికే అసవరమైన ప్రశ్నావళిని సిట్ బృందం రూపొందించింది. మైనర్ బాలికపై లైంగికదాడితోపాటు వారి మధ్య జరిగిన ఫోన్ చాటింగులను భగీరథ్ డిలీట్ చేయడం, బాలికకు రూ. 50వేలు ఇచ్చాను అని ఆయన చేసిన ప్రకటనపై సిట్ మరింత లోతుగా విచారించనున్నట్టు తెలిసింది. లైంగికదాడి ఆరునెలల క్రితం జరిగినట్టు భగీరథ్ పేర్కొంటున్న నేపథ్యంలో దానికి సంబంధించి ఆధారాలను సేకరించనుంది. మైనర్ బాలిక తల్లి వాగ్మూలాన్ని పూర్తిగా క్రోడికరించి, భగరీథ్ నుంచి అదనపు సమాచారాన్ని , నిజాలను వెలికి తీసేందుకు అవసరమైన కసరత్తు పూర్తి చేసింది. మొత్తం మీద సిట్ అధికారుల విచారణలో నిందితుడు ఏమేరకు అంగీకరిస్తారనే కోణంలో ఇటు రాజకీయ వర్గాలు, అటు పోలీస్‌వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఎలాంటి నిజాలు బయటకు వస్తాయో చూడాల్సిందే.

# మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన మున్సిపల్ చైర్మన్ సారంగపాణి



**వర్ధన్నపేట/మే 26(జర్నలిస్ట్ వార్త):** వందేళ్ల వయసులో మృతి చెందిన ఆడెపు సోమక్క కుటుంబ సభ్యులను మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి పరామర్శించారు. మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డుకు చెందిన సోమక్క ఇటీవల మృతి చెందగా, మంగళవారం వారి నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సోమక్క శతాయుష్షుతో జీవించి కుటుంబానికి ఆదర్శంగా నిలిచారన్నారు. గ్రామీణ సంప్రదాయాలు, విలువలను పాటిస్తూ అందరికీ మార్గదర్శిగా నిలిచిన ఆమె మరణం తీరని లోటన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తిరుపెల్లి వాణి–కుమారస్వామి, నాయకులు బచ్చు గంగాధర్ రావు, పూజారి శ్రీనివాస్, సారయ్య పాల్గొన్నారు.

# తీవ్ర ఎండలు,వడగాలుల నేపథ్యంలో సామాన్య ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

## -బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్రీనివాస్ రావు.

**బయ్యారం/,మే 26.(జర్నలిస్ట్ వార్త)**



మండలంలో తీవ్ర ఎండలు, వడగాలులు కొనసాగుతున్న నేపథ్యంలో సామాన్య ప్రజలు,ఉపాధి హామీ కూలీలు అప్రమత్తంగా ఉండాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్రీనివాస్ రావు అన్నారు.మండలంలో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదు అవుతున్నందున,ముఖ్యంగా ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచించారు.వృద్ధులు,చిన్నపిల్లలు, గర్భిణీలు,అనారోగ్యంతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తుమ్మల శ్రీనివాస్ రావు తెలిపారు.ఎండ తీవ్రత వల్ల వడదెబ్బకు గురయ్యే ప్రమాదం అధికంగా ఉండడంతో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రజలు తరచుగా నీరు,మజ్జిగ, కొబ్బరి నీరు,నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని,పుచ్చకాయ, దోసకాయ వంటి నీటి శాతం అధికంగా ఉండే పండ్లను తీసుకోవాలని తెలిపారు.బయటకు వెళ్లే సమయంలో గొడుగు,టోపీ వంటివి వడదెబ్బ తగలకుండా ఉపయోగించాలని అన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రావొద్దని సూచించారు.వడదెబ్బ లక్షణాలైన అధిక జ్వరం, తలనొప్పి, తల తిరగడం, వాంతులు, అలసట,చెమట ఆగిపోవడం, స్పృహ కోల్పోవడం వంటి సమస్యలు కనిపిస్తే వెంటనే బాధితులను చల్లని ప్రదేశానికి తరలించలన్నారు.ప్రజలు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తుమ్మల శ్రీనివాస్ రావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించాలి.

**బయ్యారం/,మే 26.(జర్నలిస్ట్ వార్త)**



మోడీ ప్రభుత్వం పది రోజుల్లో మూడవసారి పెట్రోల్ డీజిల్ ధరలను పెంచి ప్రజల నడ్డి విరిచిందని, పెట్రోల్ పై లీటరుకు 2.61 రూపాయలు, డీజిల్ పై 2.71 రూపాయలు పెంచడంతో గత పది రోజుల్లో లీటర్ పెట్రోల్ రూ 7.38 పెట్రోల్, డీజిల్ రూ. 7.49 పైసలు పెంచడం దారుణమని జగ్గుతండా ఉపసర్పంచ్ గుంజ వీరస్వామి అన్నారు.నేటి ఉదయం పెట్రోల్ పోసుకోవడానికి వెళ్తే 115 రూపాయల 83 పైసలని బంకులో అన్నారని చెప్పారు.ఒకవైపు ప్రధానమంత్రి మోడీ మ ప్రజలకు పొదుపు చేయాలని చెప్పి ఆయన మాత్రం పెట్రోల్ డీజిల్ ధరలను పెంచడం ఏమిటని ప్రశ్నించారు.పెంచిన ధరలను ఉపసంహరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని గుంజ వీరస్వామి డిమాండ్ చేశారు.చమురు సంస్థల ఒత్తిడితో పెట్రోల్, డీజిల్ ధరలను కనీసం లీటరుకు రూ.15 వరకు పెంచడానికి కేంద్రం సిద్ధమైనట్లు వస్తున్న వార్తలు ప్రజలను తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు.చమురు కొరత లేదని, ధరలు పెరగవని ఎన్నికల ముందు చెప్పిన కేంద్రం నేడు వరుసగా పెంచడం ప్రజలను మోసగించడమేనని విమర్శించారు. ఒక్కసారిగా భారీగా పెంచితే ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని దశల వారిగా పెంచడం వంచించడమేనని పేర్కొన్నారు. ఇంధన ధరల పెరుగుదలతో రవాణా ఖర్చులు, నిత్యావసర వస్తువుల ధరలతో పాటు అన్ని రకాల సరుకుల ధరలు మరింత పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించాలని వీరస్వామి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# స్థలం కొలతల వివాదంలో తలెత్తిన గొడవ

## ఓ వ్యక్తి ఆత్మహత్యా ప్రయత్నానికి దారితీసింది

**గీసుగొండ/మే 26 (జర్నలిస్ట్ వార్త):** స్థలం కొలతల వివాదంలో తలెత్తిన గొడవ ఓ వ్యక్తి ఆత్మహత్యా ప్రయత్నానికి దారితీసింది. గీసుగొండ మండలం మంగళ తండాకు చెందిన కేలోతు కవిత, శ్రీధర్ దంపతులు తమ ఇ ఇంటి స్థలాన్ని బంధువులైన విజయ, మంగమ్మలకు అమ్మేందుకు ఒప్పందం కుదుర్చుకొని అడ్వాన్స్ తీసుకున్నారు. సోమవారం మధ్యాహ్నం గ్రామ పెద్దల సమక్షంలో స్థలం కొలతలు వేస్తుండగా.. కేలోతు శ్రీను, పద్మ, రమేష్, విజయ, గోరి తదితరులు శ్రీధర్ దంపతులతో ఘర్షణకు దిగారు. అందరి ముందే తమను బూతులు తిడుతూ, చెప్పులతో కొట్టి తీవ్రంగా అవమానించడంతో మనస్తాపానికి గురైన శ్రీధర్.. సాయంత్రం ఇంట్లో గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ను చికిత్స నిమిత్తం నర్సంపేటలోని ఆసుపత్రికి తరలించారు. బాధితుడి భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుగొండ సీఐ డి. విశ్వేశ్వర్ తెలిపారు

# “అంతా నా ఇష్టం.. ఆపేదెవరు రా..!”

## సీసీ రోడ్డుకు ఫెన్సింగ్.. ఒంటరి మహిళకు దారి బంద్ -ప్రజావాణి గడప తొక్కిన బాధితురాలు

**నర్సంపేట/, మే 26 (జర్నలిస్టు వార్త):** “అంతా నా ఇష్టం.. ఆపేదెవరు రా.. ఈ రోడ్డు నా జాగాలో వేసుకున్నా.. ఎవ్వరూ నడవొద్దు..” అంటూ అధికార పార్టీ వార్డు సభ్యుడు హుకుం జారీ చేసిన ఘటన నర్సంపేట నియోజకవర్గంలోని కానాపురం మండలం దబ్బీర్‌పేట గ్రామంలో కలకలం రేపుతోంది. ప్రజల రాకపోకల కోసం వేసిన సీసీ రోడ్డుకే ఫెన్సింగ్ వేయడంతో ఓ ఒంటరి మహిళ ఇంటి దారి మూసుకుపోయిందంటూ గ్రామంలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామానికి చెందిన గాదం సాంబ భర్త కొమురయ్య మృతి చెందగా, ఆమె ఒంటరిగా జీవిస్తోంది. ఆమె ఇంటికి ఆనుకుని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మించారు. అయితే సాంబ అనారోగ్యంతో తన కుమార్తె ఇంటికి వెళ్లిన సమయంలోనే మూడో వార్డు సభ్యుడు పెరబోయిన కుమారస్వామి తన సోదరుడు నరేష్ ఇంటి వద్ద నుంచి రోడ్డు వరకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు బాధితురాలు ఆరోపిస్తోంది. దీంతో తన ఇంటికి వెళ్లే దారి పూర్తిగా మూసుకుపోయిందని వాపోతోంది.ఈ విషయంపై గ్రామ పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయతీలు జరిగినా ఫలితం లేకపోయిందని తెలుస్తోంది. “సీసీ రోడ్డు నా సొంత స్థలంలో వేసుకున్నా.. మీరెవరు అడిగేది.. వెనుక నుంచి వెళ్లండి” అంటూ వార్డు సభ్యుడు పెద్దల ఎదుటే తీవ్ర స్థాయిలో మాట్లాడినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. పెద్దల మాటలు కూడా పట్టించుకోకుండా అక్కడి నుంచి వెళ్లిపోయాడని ఆరోపిస్తున్నారు.ఏం చేయాలో తెలియని స్థితిలో ఉన్న గాదం సాంబ చివరకు ప్రజావాణిని ఆశ్రయించింది. అధికారులైనా స్పందించి తనకు న్యాయం చేయాలని వేడుకుంటోంది.ఇక గ్రామ ప్రజలు మాత్రం గ్రామాభివృద్ధి నిధులతో వేసిన సీసీ రోడ్డును వ్యక్తిగత ఆస్తిలా ప్రకటించడం దుర్మార్గమని మండిపడుతున్నారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి కావడంతో ఎవరినీ లెక్కచేయకుండా వ్యవహరిస్తున్నాడని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# నల్లబెల్లికి ఆర్టీసీ బస్సు పునరుద్ధరణ- గ్రామస్తుల హర్షం

**వర్ధన్నపేట/ మే 26 (జర్నలిస్ట్ వార్త):**





వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామ ప్రజల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. వరంగల్ నుంచి పంతిని మీదుగా నల్లబెల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసును అధికారులు ఎట్టకేలకు పునరుద్ధరించారు. గతంలో కరోనా లాక్‌డౌన్ సమయంలో ఈ బస్సు సర్వీసును బొల్లికుంట మీదుగా మళ్లించారు. అయితే, ఇటీవల అక్కడ సీసీ రోడ్డు పనులు ప్రారంభం కావడంతో నల్లబెల్లికి బస్సు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.రవాణా సౌకర్యం లేకపోవడంతో గ్రామానికి చెందిన విద్యార్థులు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు, వ్యాపారులు మండల కేంద్రానికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోయారు.ఈ ప్రజా సమస్యపై దళిత రత్నా అవార్డు గ్రహీత ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పీ రాష్ట్ర నాయకులు బిర్రు మహేందర్ మాదిగ ఆధ్వర్యంలో గ్రామస్తులు వరంగల్ ఆర్టీసీ డివిజనల్ మేనేజర్ (డీఎం)ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామస్తుల ఇబ్బందులను ఆయనకు వివరించారు.దీనిపై సానుకూలంగా స్పందించిన డీఎం.వయా పంతిని మీదుగా నల్లబెల్లికి లోకల్ బస్సు సర్వీసును పునరుద్ధరిస్తూ తక్షణ ఉత్తర్వులు జారీ చేశారు.మళ్లీ తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు రావడంతో నల్లబెల్లి గ్రామ ప్రజలు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై త్వరితగతిన స్పందించి బస్సును పునరుద్ధరించిన ఆర్టీసీ అధికారులకు, చొరవ చూపిన నాయకుడు బిర్రు మహేందర్ మాదిగకు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# వీరనారాయణపూర్‌లో అగ్నికీలల్లో గడ్డి కట్టలు

## ఈదురుగాలులకు ఊగిన విద్యుత్ తీగలతో ప్రమాదం -రైతుకు రూ.2 లక్షల వరకు నష్టం






**ఎల్కతుర్తి,/ మే 26 (జర్నలిస్ట్ వార్త):**
ఎల్కతుర్తి మండలం వీరనారాయణపూర్ గ్రామంలో సోమవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుని భారీగా గడ్డి కట్టలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన రైతు నార్ల గిరి రవీందర్‌కు చెందిన పొలంలో నిల్వ ఉంచిన సుమారు 90 గడ్డి కట్టలు మంటల్లో కాలిపోయాయి. ఈ ఘటనలో లక్ష నుంచి రెండు లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు గ్రామ సర్పంచ్ పుల్లూరు శ్రీధర్‌రావు తెలిపారు.గ్రామస్తుల కథనం ప్రకారం.. మధ్యాహ్న సమయంలో వీచిన ఈదురుగాలులకు విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగలడంతో చిమ్మిన మిణుగురులు గడ్డి కట్టలపై పడి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు వెంటనే మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే గడ్డి కట్టలు పూర్తిగా దగ్ధమయ్యాయి.ఘటన స్థలాన్ని పరిశీలించిన సర్పంచ్ శ్రీధర్‌రావు బాధిత రైతు కుటుంబాన్ని పరామర్శించారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్ వంటి విషవాయువులు విడుదలై ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని హెచ్చరించారు.ఇటీవల పలు గ్రామాల్లో మంటల కారణంగా బావుల మోటార్లు, పైపులు, టెక్‌వనాలు దెబ్బతిన్న ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరమని ఆయన పేర్కొన్నారు.

# ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యం..!

## ప్రైవేట్ స్కూళ్ల అక్రమాలపై ఎందుకీ మౌనం..?

**ఎల్కతుర్తి/, మే 26 (జర్నలిస్ట్ వార్త):**
ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థుల చేరికలను పెంచేందుకు ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి ఎర్ర సునీత సూచించారు. ఎల్కతుర్తి మండల అభివృద్ధి కార్యాలయ ఆవరణలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికల్లో భాగంగా నిర్వహించిన “ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట” కార్యక్రమ సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు.




వచ్చే విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో అధిక సంఖ్యలో విద్యార్థులను చేర్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె పేర్కొన్నారు. మండల విద్యాధికారి చదువుల సత్యనారాయణ మాట్లాడుతూ, విద్యార్థుల నమోదు తక్కువగా ఉన్న పాఠశాలల ఉపాధ్యాయులను అవసరమైతే ఇతర పాఠశాలలకు డిప్యూటేషన్‌పై పంపనున్నట్లు తెలిపారు. జూన్ 3న నిర్వహించే “బడిబాట” కార్యక్రమాన్ని విజయవంతం చేసి ఇంటింటి ప్రచారం చేపట్టాలని సూచించారు.
ఎంపీడీవో విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలను ప్రజలకు వివరించాలని అన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందుతోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరారు.
ఈ సమావేశంలో స్థానిక సర్పంచ్ లావణ్యతో పాటు వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రైవేట్ పాఠశాలల అక్రమాలపై ఆరోపణలు**

ఇదిలా ఉండగా మండలంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ అనుమతులు లేకుండానే కొనసాగుతున్నాయని, విద్యాశాఖ అధికారుల కనుసన్నల్లోనే నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. చిన్నారుల వయోపరిమితి నిబంధనలు ఉల్లంఘిస్తూ అడ్మిషన్లు తీసుకోవడం, టీసీల జారీ విషయంలో అక్రమాలు, అధ్యాపకుల అర్హత ధ్రువపత్రాల పరిశీలనలో నిర్లక్ష్యం వంటి అంశాలపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
కొత్తగా ప్రారంభమైన కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో రెండున్నర నుంచి మూడు సంవత్సరాల పిల్లలను ఆటోల్లో తరలిస్తూ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యంపై సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తున్న అధికారులు, ప్రైవేట్ పాఠశాలల అక్రమాలపై మాత్రం మౌనం పాటిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.
పలు గ్రామాల్లో కొందరు ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడం, విధి సమయంలో మొబైల్ ఫోన్లలో గేమ్స్, టీవీ కార్యక్రమాల్లో నిమగ్నమవుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# సౌర విద్యుత్‌తో ఆదా.. రైతులకు భారీ ఆదాయం

## పీఎం సూర్యఘర్ యోజనపై అవగాహన సదస్సు





**నర్సంపేట/, మే 26 (జర్నలిస్ట్ వార్త):** సౌర విద్యుత్ వినియోగంతో విద్యుత్ ఖర్చులు తగ్గడంతో పాటు అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందని టీజీ రెడ్‌కో జిల్లా మేనేజర్ గంధం రాజేందర్ అన్నారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పీఎం సూర్యఘర్ యోజనపై మంగళవారం నర్సంపేట పట్టణంలోని సిటిజన్ క్లబ్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం లక్ష్మీ రామానంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ప్రతి కుటుంబం తమ ఇళ్ల పైకప్పులపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుని సూర్యశక్తిని విద్యుత్‌గా మార్చుకుని స్వయంగా విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ యోజన కింద 1 కిలోవాట్‌కు రూ.30 వేల, 2 కిలోవాట్లకు రూ.60 వేల, 3 కిలోవాట్లకు రూ.78 వేల వరకు సబ్సిడీ అందిస్తున్నట్లు వివరించారు.పీఎం కుసుమ్ పథకం ద్వారా రైతులు తమ వ్యవసాయ భూముల్లో సోలార్ విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేసుకుని స్థిరమైన ఆదాయం పొందవచ్చన్నారు. ఒక మెగావాట్ సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు 3.5 నుంచి 4 ఎకరాల భూమి అవసరమవుతుందని, ఆ భూమి సమీప సబ్‌స్టేషన్‌కు 5 కిలోమీటర్ల పరిధిలో ఉండాలని చెప్పారు. ఒక మెగావాట్ ప్లాంట్ ఏర్పాటుకు సుమారు రూ.3.5 కోట్ల వ్యయం అవుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను 25 సంవత్సరాల పాటు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటోందని, రైతులకు రుణ సదుపాయాలు కూడా కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా రైతులు సంవత్సరానికి రూ.50 లక్షల నుంచి రూ.52 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు.మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం లక్ష్మీ రామానంద్ మాట్లాడుతూ సోలార్ వ్యవస్థల వినియోగంతో విద్యుత్ బిల్లులు తగ్గడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందుతుందని తెలిపారు. అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించి ఆదాయం పొందవచ్చన్నారు.
మున్సిపల్ వైస్ చైర్మన్ గంధం నరేందర్ మాట్లాడుతూ సౌర విద్యుత్ వినియోగం ద్వారా బొగ్గు వంటి శిలాజ ఇంధనాల వినియోగం తగ్గి కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. విదేశీ ఇంధనాలపై ఆధారపడే పరిస్థితి తగ్గి దేశానికి విదేశీ మారకద్రవ్య ఆదా జరుగుతుందన్నారు.మున్సిపల్ కమిషనర్ భాస్కర్ మాట్లాడుతూ ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుని స్వచ్ఛమైన, పర్యావరణహిత భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు.అనంతరం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. "బాల్య వివాహం జరిగితే బతుకు ఆగమవుతుంది" అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం లక్ష్మీ రామానంద్ సూచించారు. బాల్య వివాహాల వల్ల తల్లి, శిశువుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్లు అరుణ, పారిజాతం, కౌన్సిలర్లు బాణాల ప్రసన్న, రజిత, అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి, మెప్మా సీఏల్‌ఆర్పీలు రామగిరి మాధవి, సుమలత, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# విధుల్లో బిజీ... కుటుంబానికి సమయం

## శుభకార్యానికి హాజరైన ఎస్సై ఉమా



**వైరా/, మే 26 (జర్నలిస్ట్ వార్త):** పోలీసు విధుల్లో నిత్యం తీరిక లేకుండా గడిపే అధికారులు కూడా కుటుంబ బంధాలకు ప్రాధాన్యత ఇస్తారని నాగోల్ పోలీస్‌స్టేషన్ ఎస్సై బండి ఉమా చాటి చెప్పారు. వైరా మండలం పుణ్యపురం గ్రామానికి చెందిన ఆమె, అధికారిక బాధ్యతల నడుమ కుటుంబ సభ్యులతో కలిసి శుభకార్యానికి హాజరై ఆత్మీయతను పంచుకున్నారు.తన భర్త ఈలప్రోలు మహేష్‌తో పాటు కుటుంబ సభ్యులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై ఉమా, బంధువులతో కలిసిమెలిసి సాధారణ గృహిణిలా సందడి చేశారు. ఆమెను చూసిన గ్రామస్థులు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గద్దె మల్లికార్జున్‌రావు, బోల్ల వెంకటి తదితరులు ఎస్సై ఉమాను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# జానపాకలో గుడుంబా పట్టివేత

## : ఇద్దరిపై కేసు నమోదు

**గీసుగొండ/మే 26 (జర్నలిస్ట్ వార్త):** గీసుగొండ మండల పరిధిలోని జానపాక గ్రామంలో ప్రభుత్వ నిషేధిత గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. జానపాకకు చెందిన బాదావత్ విజయ్ కుమార్, ఖానాపూర్ మండలం మంగళవారిపేటకు చెందిన బోడ సురేష్‌లు తమ ఇంటి వద్ద గుడుంబా అమ్ముతున్నారనే నమ్మదగిన సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఈ తనిఖీల్లో వారి వద్ద నుంచి 15 లీటర్ల నల్లబెల్లం గుడుంబాను పంచుల సమక్షంలో సీజ్ చేశారు. నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు గీసుగొండ సీఐ డి. విశ్వేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే గుడుంబాను విక్రయిస్తే సహించేది లేదన్నారు. ఎవరైనా గుడుంబా తయారు చేసినా, విక్రయించినా వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

# సీఐ స్వామిని కలిసిన మాల మహానాడు నాయకులు మన్నె బాబు రావు



**వరంగల్/ మే 26 (జర్నలిస్ట్ వార్త):** వరంగల్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) స్వామిని మాల మహానాడు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో సీఐని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో స్థానిక ప్రజలకు అండగా నిలవాలని ఈ సందర్భంగా వారు కోరారు. సీఐని కలిసిన వారిలో మాల మహానాడు నాయకులు మన్నె బాబురావు, వెంకటేశ్వర్లు, రామచంద్రరావు తదితరులు ఉన్నారు.

# గో టు విలేజ్ విజయవంతం చేయాలి

## వర్గీకరణ ఫలాలను యువత అందిపుచ్చుకోవాలి -రాపకపల్లిలో ఎంఆర్‌పీఎస్ గద్దె నిర్మాణ పనుల ప్రారంభం

**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో మే 26 (జర్నలిస్ట్ వార్త):** ఎస్సీ వర్గీకరణ ఉద్యమ ఫలాలను మాదిగ యువత సద్వినియోగం చేసుకుని విద్య, ఉద్యోగ రంగాల్లో ముందుకు రావాలని ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ పిలుపునిచ్చారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "గో టు విలేజ్" కార్యక్రమంలో భాగంగా మంగళవారం ధర్మసాగర్ మండలం రాపకపల్లి గ్రామంలో ఎంఆర్‌పీఎస్ నూతన గద్దె నిర్మాణ పనులను ప్రారంభించారు.ఎంఆర్‌పీఎస్ గ్రామ అధ్యక్షుడు పులిపాక చిరంజీవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కందుకూరి జయేందర్‌తో కలిసి నాయకులు ముగ్గు పోసి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ సుదీర్ఘ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. ఉద్యమ ఫలాలను గ్రామీణ యువత సద్వినియోగం చేసుకుని చదువులో, ఉద్యోగాల్లో రాణించాలని సూచించారు.



చదువు మధ్యలో నిలిపివేసిన విద్యార్థులు మళ్లీ విద్యాభ్యాసంపై దృష్టి పెట్టాలని, ఉన్నత చదువుల కోసం ముందుకు రావాలని కోరారు. చదువుకోవాలనే ఆసక్తి ఉన్న యువతకు ఎంఆర్‌పీఎస్ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.
కార్యక్రమాన్ని ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి, ధర్మసాగర్ మండల ఇన్‌చార్జి గంగారపు శ్రీనివాస్ మాదిగ సమన్వయం చేశారు.
ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఇమ్మడి సురేష్, కందుకూరి కరుణాకర్ మాదిగ, కందుకూరి శ్యామ్‌సుందర్ మాదిగ, ఇమ్మడి ఉప్పలయ్య మాదిగ, ఇమ్మడి కరుణాకర్ మాదిగ, వస్కుల దేవరాజ్ మాదిగ, కందుకూరి కరణ్ మాదిగ, కందుకూరి మల్లేశం మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో అసహజ జనాభా మార్పు

## ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు -హోంమంత్రి అమిత్ షా వెల్లడి

**న్యూఢిల్లీ,మే 26 (జర్నలిస్ట్ వార్త):** అక్రమ వలసలు, ఇతర కారణాలతో దేశంలో చోటుచేసుకుంటున్న 'అసహజ జనాభా మార్పు'పై ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్టు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ 2025 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చేసిన ప్రకటనకు అనుగుణంగా ఈ కమిటీని ఏర్పాటు చేసినట్టు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. ఈ కమిటీకి రిటైర్డ్ జడ్జి ప్రకాష్ ప్రభాకర్ నావోలేకర్ అధ్యక్షత వహిస్తారని, మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ఆర్థికవేత్త డాక్టర్ షమికా రవి సభ్యులుగా ఉంటారని అమిత్‌షా తెలిపారు. కమిటీ మెంబర్‌గా హోం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ ఉంటారని చెప్పారు. దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న జనాభా మార్పులపై కమిటీ సమగ్ర మూల్యాంకనం చేసి పరిష్కారం సూచిస్తుందని అమిత్‌షా తెలిపారు. జనాభా మార్పు సమస్య భారతదేశ సార్వభౌమత్యం, జాతీయ భద్రత, సామాజిక సమతుల్యత, ఆదివాసీ సమాజాల పరిరక్షణకు పెను సవాలుగా మారిందన్నారు. మత, సామాజిక వర్గాల స్థాయిలో జనాభా మార్పుల సరళని కమిటీ విశ్లేషిస్తుందని చెప్పారు.

------------

# అర్హులంతా ఓటరు జాబితాలో ఉండాల్సిందే

## అనర్హుల పేర్లను మాత్రమే తొలగించాలి -సర్ ప్రక్రియపై ఎన్నికల అధికారి ఆదేశాలు

**హైదరాబాద్,మే 26 (జర్నలిస్ట్ వార్త):** భారత ఎన్నికల సంఘం రాష్ట్రంలో త్వరలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పక్రియలో భాగంగా రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అలాగే అనర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఐఏఎస్ ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బిఆర్‌కెఆర్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఐఏఎస్, ఉప ప్రధాన ఎన్నికల అధికారి (ఎఫ్‌ఏసీ) జి.ఎస్. చారిలతో కలిసి ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిహెచ్‌ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్, ఐఏఎస్, మేడ్చల్?మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. మను చౌదరి, ఐఏఎస్, సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు హాజరయ్యారు. మ్యాపింగ్ పక్రియ లో బూత్ స్థాయి అధికారులు కీలక పాత్ర పోషిస్తున్నందున వారికి తగిన శిక్షణ ఇవ్వాలని సూచించారు. అలాగే పనివిధానంపై నిరంతరం సమీక్షిస్తూ, మ్యాపింగ్ పక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే అపార్టుమెంట్స్ సముదాయాలు, గేటెడ్ కమ్యూనిటీలపై ప్రత్యేక దృష్టి సారించి సర్ పక్రియ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో, ముఖ్యంగా మురికివాడలలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. పక్రియను మరింత సరళీతరం చేయడానికి ఎన్యూమరేషన్ ఫారాలు ఆంగ్లం, తెలుగు భాషల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. అలాగే ఓటర్ల మ్యాపింగ్ పక్రియ సక్రమంగా జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పక్రియ నిర్వహణలో పాలుపంచుకుంటున్న క్షేత్రస్థాయి సిబ్బందిని ప్రోత్సహించేందుకు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అవార్డు అందజేయనున్నట్లు ప్రధాన ఎన్నికల అధికారి ప్రకటించారు.

# 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'

## ఇంటింటి సర్వే పూర్తయిన ఇళ్లకు ప్రత్యేక లోగో స్టిక్కర్లు

## భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం

**హైదరాబాద్,మే 26 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా ప్రణాళిక కార్యక్రమం విజయవంతం కావడంతో, దాని ముగింపు వేడుకలను పురస్కరించుకుని జూన్ 2 నుండి 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించాలని కెబినెట్ సబ్ కమిటి అధికారులను ఆదేశించింది. మంగళవారం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటి సమావేశం జరిగింది. ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం లో మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డిలు పాల్గొన్నారు. గ్రామ సభ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ఇప్పటివరకు నిర్వహించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాల ప్రగతిని సమీక్షించిన కేబినెట్ సబ్ కమిటి రాబోయే రోజుల్లో ప్రజా భాగస్వామ్యంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా జూన్ 2 నుండి 12 వరకు నిర్వాహించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ముఖ్యంగా 'పర్యావరణ వారోత్సవం', రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం, మహిళా-శిశు రక్షణ, గృహ నిర్మాణం, పర్యాటక ప్రోత్సాహం, పట్టణాభివృద్ధి, పునర్వినియోగ శక్తి (గ్రీన్ ఎనర్జీ) ప్రాజెక్టుల అభివృద్ధి కార్యక్రమాల



శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను నిర్వహించాలని నిర్దేశర చేశారు. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా, అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని మంత్రులు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకం అమలుపై కేబినెట్ సబ్ కమిటీ సుదీర్ఘంగా చర్చించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తింపజేయాల న్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రులు పునరుద్ఘాటించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇల్లు కవర్ అయ్యేలా సమగ్ర గృహ స్థాయి డేటా సేకరణ జరపాలి. ఒకవేళ ఎవరైనా మిగిలిపోతే వారి కోసం ప్రత్యేక శిబిరాలు (స్పెషల్ క్యాంపులు) ఏర్పాటు చేయాలి. పథకం ప్రయోజనాలు ప్రజల్లోకి తీసుకెళ్లేలా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఈ బీమా పథకానికి ఒక విశిష్టమైన 'లోగో'ను రూపకల్పన చేయనున్నారు. సర్వే పూర్తయిన ప్రతి ఇంటికి ఈ లోగోతో కూడిన స్టిక్కర్లను అతికించనున్నారు. మేరకు అన్ని శాఖలు తమ సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ రావు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిజిపి సి.వి ఆనంద్, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, వికాస్ రాజు, నవీన్ మిత్తల్, వాణి ప్రసాద్, దాన కిషోర్, ప్రిన్సిపల్ సెక్రటరీలు సందీప్ కుమార్ సుల్తానీయా, గౌరవ్ ఉప్పల్, తదితర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.



# 'యల్లమ్మ'కు అందుకే ఓకే చెప్పా..

## దేవి శ్రీ ప్రసాద్ స్పెషల్ వీడియో

ప్రముఖ సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ నటుడిగా అరంగేట్రం చేయనున్న సంగతి తెలిసిందే. వేణు యెల్దండి దర్శకత్వంలో 'యల్లమ్మ' అనే చిత్రంలో ఆయన హీరోగా నటిస్తున్నారు. అయితే, ఒక అగ్ర సంగీత దర్శకుడిగా ఉండి నటన వైపు ఎందుకు అడుగులు వేశారనే దానిపై డీఎస్పీ స్వయంగా స్పందించారు. తను ఈ సినిమా చేయడానికి అంగీకరించడం వెనుక ఉన్న అసలు కారణాన్ని మంగళవారం వెల్లడించారు.

ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఓ ప్రత్యేక వీడియోను పంచుకున్నారు. తన తండ్రి స్వగ్రామమైన వెదురుపాకలో తాను పర్యటించిన దృశ్యాలను అందులో చూపించారు. "చిన్నప్పటి నుంచి జానపద కళల పట్ల నాలో ఆసక్తిని నింపిన అద్భుతమైన సంప్రదాయాలు, సంస్కృతి ఇదే. మా ఊరిలో జరిగే 'అమ్మోరు జాతర' వేడుకలు నాపై తీవ్ర ప్రభావం చూపాయి. 'యల్లమ్మ'కు నేను ఎందుకు ఓకే చెప్పానో ఇదే కారణం" అని డీఎస్పీ పోస్ట్‌లో పేర్కొన్నారు. చిన్నప్పుడు తన తండ్రి తమను చెన్నై నుంచి తరచూ ఈ గ్రామానికి తీసుకొచ్చేవారని, ఇక్కడి ప్రకృతి స్వచ్ఛతను ఆస్వాదించేలా చేశారని డీఎస్పీ గుర్తుచేసుకున్నారు. "మా మూలాలతో, మా వాళ్లతో సంబంధం కొనసాగేందుకు మేం ఇక్కడ అందమైన ఇల్లు కట్టుకున్నాం. సంస్కృతి, జానపద కళలు, దైవత్వం వంటి గొప్ప విషయాలను ఈ ఊరే నాకు నేర్పింది. అదే నాకు స్ఫూర్తినిచ్చింది" అని వీడియోలో వివరించారు. ఈ అనుబంధం కారణంగానే 'యల్లమ్మ' కథకు వెంటనే కనెక్ట్ అయినట్లు తెలిపారు. దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వేణు యెల్దండి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా కోసం దర్శకుడు వేణు, డీఎస్పీ మధ్య తొలి సమావేశం ఏకంగా 8 గంటల పాటు సాగడం అప్పట్లో చర్చనీయాంశమైంది. ఈ చిత్రంలో డీఎస్పీ 'పర్శి' అనే పాత్రలో కనిపించనుండగా, సంగీతాన్ని కూడా ఆయనే అందిస్తున్నారు.

# 'పెద్ది' ప్రమోషన్స్... 'దేశీ ప్రిన్సెస్'లా జాన్వీ!

బాలీవుడ్ యువ నటి జాన్వీ కపూర్ తన ఫ్యాషన్ సెన్స్‌తో మరోసారి అందరినీ ఆశ్చర్యపరిచారు. బెంగళూరులో తన తాజా చిత్రం 'పెద్ది' ప్రమోషన్లలో భాగంగా ఆమె ధరించిన ఒక ప్రత్యేకమైన డ్రెస్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. సాంప్రదాయ బెనారసీ వస్త్రానికి ఆధునిక హంగులు జోడించి రూపొందించిన గౌనులో జాన్వీ అచ్చం 'దేశీ ప్రిన్సెస్' (భారతీయ యువరాణి)లా మెరిసిపోయారు. సాధారణంగా బెనారసీ అంటే చీరనే గుర్తుకువస్తుంది. కానీ, జాన్వీ దానికి భిన్నంగా స్ట్రాప్‌లెస్ గౌనును ఎంచుకున్నారు. కార్సెట్ తరహా బాడీస్‌తో, ఫిట్‌గా ఉండే ఈ గౌను ఆమె అందాన్ని మరింత పెంచింది. లేత గులాబీ, మింట్, ఐవరీ వంటి పాస్టెల్ రంగుల కలయిక, బంగారు వర్ణంతో నేసిన పూల డిజైన్లు ఈ డ్రెస్‌కు ప్రత్యేక ఆకర్షణను తెచ్చిపెట్టాయి. దీనికి జతగా చేతులపై కప్పుకున్న షీర్ పాస్టెల్ దుపట్టా రాజసమైన లుక్‌ను ఇచ్చింది. ఈ డ్రెస్‌కు తగ్గట్టుగా ఆక్సిడైజ్డ్ సిల్వర్ జుంకాలు, స్టేట్‌మెంట్ ఇయర్ కఫ్ వంటి మినిమల్ యాక్సెసరీస్ ధరించారు. నుదుట పాపిడితో వేసిన స్లీక్ బన్, గ్లోయీ మేకప్‌తో తన లుక్‌ను పూర్తిచేశారు. ఇటీవలే పర్పుల్ లెహంగాతో వైరల్ అయిన జాన్వీ, ఇప్పుడు ఈ బెనారసీ గౌనుతో సంప్రదాయ వస్త్రకళకు, ఆధునిక ఫ్యాషన్‌కు మధ్య అద్భుతమైన బ్యాలెన్స్ ఎలా సాధించవచ్చో నిరూపించారు.



# చెన్నై లవ్‌స్టోరీ నుంచి నిను వదలనే ..సెకండ్ సింగిల్ విడుదల




నిమిషమైనా నిను వదలనే.. అంటూ తన మ్యూజిక్‌తో మ్యాజిక్ క్రియేట్ చేశారు మణిశర్మ. కిరణ్ అబ్బవరం ప్రధానపాత్రలో రవి నంబూరి దర్శకత్వంలో రానున్న చిత్రం 'చెన్నై లవ్‌స్టోరీ'. తాజాగా ఈసినిమా నుంచి సెకండ్ సింగిల్‌ను టీమ్ విడుదల చేసింది. 'నను నేను వదిలినా.. నిను వదలనే..' అంటూ సాగే లిరిక్స్ అనంత్ శ్రీరామ్ అందించగా.. జావెద్ అలీ తన గాత్రంతో మరోస్థాయికి తీసుకెళ్లారు. యూత్‌కు కనెక్ట్ అయ్యేలా ఉన్న ఈ పాటను తీర్చిదిద్దారు. తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్న యువ నటి శ్రీ గౌరి ప్రియ. వరుసగా విభిన్న పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈ తెలుగమ్మాయి ప్రస్తుతం హీరో కిరణ్ అబ్బవరంతో కలిసి 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రంలో నటిస్తోంది. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన 'వదలనే' పాట లాంచ్ ఈవెంట్‌లో శ్రీ గౌరి ప్రియ చేసిన వ్యాఖ్యలు అందరినీ భావోద్వేగానికి గురి చేశాయి. ఈ పాటలోని లిరిక్స్‌ను ఎవరికి అంకితం చేస్తారని ప్రశ్నించగా, శ్రీ గౌరి ప్రియ సమాధానం ఇస్తూ ఒక్కసారిగా భావోద్వేగానికి లోనైంది. నిజంగా చెప్పాలంటే మా అమ్మ నన్ను వదిలేసి మూడేళ్లు అయింది. కానీ తను నన్ను అసలు వదల్లేదు. నేను కూడా తనను ఎప్పటికీ వదలను. ఈ విషయం తనకు తెలుసు, నాకు తెలుసు. ఈ పాటలోని లైన్స్‌ను మా అమ్మకే అంకితం చేస్తున్నాను' అని చెప్పింది. ఆమె మాటలు విన్న వెంటనే కార్యక్రమంలో ఉన్నవారు కొద్దిసేపు నిశ్శబ్దంగా మారిపోయారు. సోషల్ మీడియాలో ఈ వీడియో వేగంగా వైరల్ అవుతోంది. మూడేళ్ల క్రితం శ్రీ గౌరి ప్రియ తల్లి వసుంధర క్యాన్సర్ కారణంగా మరణించారు. తల్లితో తనకు చాలా ఆత్మీయ అనుబంధం ఉండేదని గౌరి ప్రియ పలు సందర్భాల్లో వెల్లడించింది. ఆమెను కేవలం తల్లిగానే కాకుండా ఒక మంచి స్నేహితురాలిగా భావించేదని చెప్పింది. తల్లి మరణంతో కొంతకాలం తీవ్ర మానసిక వేదనకు గురైన ఆమె, ఆ తర్వాత మళ్లీ తన కెరీర్‌పై దృష్టి పెట్టింది. హీరో కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో నటిస్తున్న 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. సంగీత దర్శకుడు మణిశర్మ స్వరాలు అందిస్తున్నారు.

# ముదిరిన డాన్-3 వివాదం

## రణ్‌వీర్‌పై సినీ ఎంప్లాయిస్ నిషేధం

'ధురంధర్' రెండు భాగాలతో సూపర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకుని కొన్ని రోజులుగా టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారారు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు రణ్‌వీర్. ఇప్పుడు ఆయన మరోసారి వార్తల్లో నిలిచారు. కొన్ని రోజులుగా చర్చనీయాంశమైన 'డాన్ 3' వివాదం ఇప్పుడు ముదిరింది. ఏకంగా ఈ అగ్ర హీరోపై బ్యాన్ విధించే పరిస్థితికి వచ్చింది. అమితాబ్ బచ్చన్, షారుఖ్ ఖాన్ తర్వాత డాన్ పాత్రను పోషించాల్సిన రణ్‌వీర్‌పై 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయిస్'(ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) మూడేళ్ల పాటు నిషేధం విధించింది. దీంతో ఆయన హాట్ టాపిక్‌గా మారారు. 2023లో ఫర్హాన్ అక్తర్ ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రణ్‌వీర్ సింగ్ హీరోగా 'డాన్ 3'ని అధికారికంగా ప్రకటించింది. అప్పుడే ప్రమోషనల్ వీడియోను విడుదల చేసి పెద్ద సంచలనం సృష్టించింది. అయితే సినిమా తీయడంలో కొంత ఆలస్యం కావడం.. స్క్రిప్ట్‌లో సమస్యలు తలెత్తడంతో రణ్‌వీర్ ఈ చిత్రం నుంచి వైదొలిగినట్లు వార్తలు వచ్చాయి. రణ్‌వీర్ తన డాన్ పాత్రను మరింత డార్క్, హింసాత్మకంగా చూపించాలని కోరుకున్నట్టు బాలీవుడ్ మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే ఫర్హాన్ అక్తర్ పాత్రను మార్చడానికి నిరాకరించడంతో ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. షూటింగ్ షెడ్యూల్ ఆలస్యం కావడంతో రణ్‌వీర్ అసహనం వ్యక్తంచేస్తూ ఈ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగినట్లు



బాలీవుడ్ కథనాలు పేర్కొన్నాయి. 'డాన్ 3' నుంచి తాను వైదొలిగిన తర్వాత దర్శకుడు ఫర్హాన్ అక్తర్‌కు రణ్‌వీర్ రూ.10కోట్లు ఆఫర్ చేసినట్లు వార్తలు వచ్చాయి. అలాగే తన తదుపరి చిత్రం 'ప్రళయ్'లో అక్తర్ నిర్మాణసంస్థకు వాటా ఇవ్వడానికి కూడా ఈ హీరో అంగీకరించారని టాక్ వినిపించింది. అయితే దీనిపై ఎవరూ అధికారికంగా స్పందించలేదు. ఒకవైపు ఈ వార్తలు వస్తోన్న తరుణంలోనే ఈ వివాదంపై ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రణ్‌వీర్ సింగ్‌పై రూ.45 కోట్ల నష్టపరిహారం కోరుతూ లీగల్ నోటీసు జారీ చేసింది. దీంతో 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయిస్'(ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) రణ్‌వీర్‌పై మూడేళ్లు నిషేధం విధించింది. రణ్‌వీర్ చర్చలకు సహకరించలేదని, నిర్మాతలు నష్టపోయిన రూ.45 కోట్ల ప్రీ ప్రొడక్షన్ నష్టపరిహారం విషయంలో నిర్మాణ సంస్థతో ఉన్న వివాదాన్ని పరిష్కరించుకునే వరకు ఆయనతో కలిసి పనిచేయవద్దని పరిశ్రమని ఆదేశిస్తూ 'ఎఫ్‌డబ్ల్యూఐసీఈ' ప్రకటన జారీ చేసింది. సినిమాలు కీలక దశలో ఉన్నప్పుడు సీనియర్‌లు, స్టార్‌లు ప్రాజెక్ట్‌ల నుంచి వైదొలగడం వినోద పరిశ్రమ స్థిరత్వానికి.. పని వాతావరణానికి తీవ్ర ముప్పును కలిగిస్తుందని ఎఫ్‌డబ్ల్యూఐసీఈ పేర్కొంది. అయితే, ఇది ప్రభుత్వం విధించిన నిషేధం కాకపోవడంతో రణ్‌వీర్‌పై పెద్దగా ప్రభావం పడదని సినీవర్గాలు భావిస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంపై రణ్‌వీర్ టీమ్ స్పందించింది. 'ఆయన తన వృత్తిని ఎంతో గౌరవిస్తారు. 'డాన్ 3' విషయంలో జరుగుతోన్న పరిణామాలపై ఆయన స్పందించకపోవడానికి కారణం ఇదే. ఊహాగానాలకు ఆజ్యం పోయడం ఆయనకు ఇష్టం లేదు' అని టీమ్ పేర్కొంది. డాన్ 3లో భాగమైన ప్రతిఒక్కరినీ ఆయన ఎంతో గౌరవిస్తారని తెలిపింది. ఈ బ్యాన్ ఆయన భవిష్యత్ ప్రాజెక్టులపై ఎంత ప్రభావం చూపుతుందనేది ఆసక్తిగా మారింది.




# ఎపిక్ నుంచి ప్రియసఖి సాంగ్ విడుదల

'జీవితాన్ని మార్చేశావే బుజ్జి నెమలి.. స్వర్గంలోతు చూపించావే పూల కడలి' అంటూ వైష్ణవీ చైతన్యపై పొగడ్తలు కురిపిస్తున్నారు హీరో ఆనంద్ దేవరకొండ. వీరిద్దరూ ప్రధానపాత్రల్లో నటిస్తోన్న చిత్రం 'ఎపిక్- ఫస్ట్ సెమిస్టర్'. మిడిల్‌క్లాస్ బయోపిక్' ఫేమ్ ఆదిత్య హాసన్ తెరకెక్కిస్తున్న చిత్రమిది. తాజాగా ఈ సినిమా నుంచి 'ప్రియసఖి..' అంటూ సాగే పాటను టీమ్ విడుదల చేసింది. సురేశ్ బానిశెట్టి లిరిక్స్ రాయగా.. కేఎస్ హరిశంకర్ ఆలపించారు.

# సిఎం విజయ్‌తో లోకేశ్ కనగరాజ్ భేటీ



తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రాత్మక విజయం సాధించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తమిళగ వెట్రి కజగం అధినేత, దళపతి విజయ్‌ను ప్రముఖ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్‌కు ఆయన స్వయంగా కలిసి తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా విజయ్‌తో దిగిన ఫొటోను షేర్ చేసిన లోకేష్ తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విజయ్ అన్నా నీకు శుభాకాంక్షలు అంటూ లోకేష్ రాసుకొచ్చాడు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'మాస్టర్', 'లియో' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ హిట్‌లుగా నిలిచిన సంగతి తెలిసిందే. కేవలం దర్శకుడిగానే కాకుండా విజయ్‌తో లోకేష్‌కు ఎంతో కాలంగా మంచి ఆత్మీయ అనుబంధం ఉంది.